





# కరపత్రం

SINCE 2014

సోమవారం ఫిబ్రవరి 2, 2026 సంపుటి : 2 సంచిక : 117 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4





## పారిశ్రామిక విప్లవానికి బడ్జెట్ బాటలు

### "భారత్‌ను తయారీ శక్తిగా మార్చే బడ్జెట్ అడుగులు"

» "గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ దిశగా కేంద్రం"
» "సెమీకండక్టర్లు--బయోఫార్మా--రేర్ ఎర్త్‌పై భారీ ఫోకస్"
» "స్వయం సమృద్ధికి పరిశ్రమల బలోపేతం"
» "ఉపాధి--సాంకేతికతే బడ్జెట్ కోర్ అజెండా"

కేంద్ర బడ్జెట్ 2026-27లో భారత ప్రభుత్వం దేశీయ ఉత్పాదక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో కొన్ని పథకాలను ప్రకటించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో 'వికసిత్ భారత్' దిశగా పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసే కొన్ని వ్యూహాత్మక రంగాలకు పెద్దపీట వేశారు.
ప్రపంచానికి తయారీ కేంద్రంగా భారత్‌ను నిలబెట్టడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ అడుగులు వేసినట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. సాంకేతికత, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పనే ప్రధాన ఎజెండాగా కేంద్రం పలు కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. చిప్ తయారీ నుంచి చౌకైన క్రీడా సామాగ్రి వరకు.. ప్రతి రంగంలో స్వయం సమృద్ధి సాధించేలా కేటాయింపులు జరిపినట్లు పేర్కొన్నారు.

#### ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) 2.0

సెమీకండక్టర్ రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చడానికి ఐఎస్ఎం 2.0ను ప్రకటించారు. కేవలం చిప్ తయారీ మాత్రమే కాకుండా, సెమీకండక్టర్ పరికరాలు, మెటీరియల్స్ ఉత్పత్తి, భారతీయ మేధో సంపత్తిని అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. ఇందుకోసం పరిశ్రమల భాగస్వామ్యంతో పరిశోధన, శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

#### బయోఫార్మా 'శక్తి'

ఫార్మా రంగాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లడానికి రూ.10,000 కోట్ల కేటాయింపుతో 'బయోఫార్మా శక్తి' పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మూడు కొత్త నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లను ఏర్పాటు చేస్తారు. 1000కి పైగా గుర్తింపు పొందిన క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్‌ను రూపొందిస్తారు.

#### అరుదైన ఖనిజాల అభివృద్ధి పథకం

చైనాపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఏపీ, ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ కారిడార్లను ఏర్పాటు చేస్తారు. అరుదైన ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్, శాశ్వత అయస్కాంతాల తయారీకి ఈ పథకం ఊతమిస్తుంది. ఇది ఎలక్ట్రిక్ వాహనాలు, రక్షణ రంగానికి అత్యంత కీలకం.

#### డెడికేటెడ్ కెమికల్ పార్కులు

దేశీయ రసాయన ఉత్పత్తిని పెంచడానికి రూ.600 కోట్లతో మూడు ప్రత్యేక కెమికల్ పార్కులను 'ఛాలెంజ్ రూట్'(సాధారణంగా ఏదైనా ఒక పెద్ద ప్రాజెక్టును ఒకే చోట కాకుండా ఏ రాష్ట్రం అయితే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందో అక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తారు. ఇందుకోసం రాష్ట్రాల మధ్య నిర్వహించే పోటీనే ఛాలెంజ్ రూట్) ద్వారా రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నారు.

మిగతాది 2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసు..

### నాలుగున్నర గంటల పాటు కేసీఆర్‌ను ప్రశ్నించిన సిట్

■ "నాలుగున్నర గంటలు కేసీఆర్‌పై సిట్ ప్రశ్నలు"
■ "ఫోన్ ట్యాపింగ్ కేసు: కేసీఆర్ సిట్ విచారణ ముగింపు"
■ "నందినగర్‌లో కేసీఆర్ విచారణ... సిట్ అధికారులు రికార్డింగ్"



**హైదరాబాద్:**
ఫోన్ ట్యాపింగ్ కేసులో భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సిట్ విచారణ ముగిసింది. హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో నాలుగున్నర గంటలకు పైగా సిట్ అధికారులు ప్రశ్నించారు. కేసీఆర్ విచాణను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డు చేశారు. విచారణ అనంతరం నందినగర్ నుంచి సిట్ అధికారులు వెళ్లిపోయారు. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటి వద్దకు బీఆర్ఎస్ నేతలు భారీగా చేరుకున్నారు. బాల్కనీలో నిలబడి పార్టీ శ్రేణులకు కేసీఆర్ అభివాదం చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల గురించి ప్రస్తావించారు. పార్టీకి క్షేత్రస్థాయిలో చాలా బాగా ఉందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కేసీఆర్ సమావేశమయ్యారు.

2లో

#### సిట్ విచారణపై స్పందించిన కేటీఆర్

కేసీఆర్ సీట్ విచారణపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు.

## 48కి 48 గెలవాలి..

■ సీఎం రేవంత్ ను అడిగి ఎన్ని నిధులైనా తెస్తా: మంత్రి కోమటిరెడ్డి
■ "48 సీట్లు.. 48 గెలుపులే లక్ష్యం: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి"
■ "సీఎం రేవంత్‌ను అడిగి నల్లగొండకు నిధుల వరద: కోమటిరెడ్డి"
■ "గెలవండి.. అభివృద్ధి నా బాధ్యత: మంత్రి కోమటిరెడ్డి హామీ"



2లో..

**హైదరాబాద్:**
నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 48 స్థానాలకు 48 స్థానాలు కాంగ్రెస్ అభ్యర్థులు గెలవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం (ఫిబ్రవరి 1) నల్లగొండ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులతో మంత్రి కోమటిరెడ్డి జూమ్ మీటింగ్ నిర్వహించారు.



## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం

**హైదరాబాద్:**
ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య (25) కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రూ.కోటి నగదు, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని.. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

2లో..

## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

### ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: భట్టి

■ "బడ్జెట్ పేరుతో తెలంగాణకు మళ్లీ చిన్నచూపు: భట్టి"
■ "ఎన్ని సార్లు కలిసినా ప్రయోజనం లేదు: కేంద్రంపై భట్టి ఫైర్"
■ "అన్ని రంగాల్లో తెలంగాణకు నిర్లక్ష్యం: భట్టి"
■ "హైదరాబాద్‌ను పక్కన పెట్టిన కేంద్రం: భట్టి విమర్శ"
■ "రాజకీయాలకు అతీతంగా ఎంపీలంతా పోరాడాలి: భట్టి పిలుపు"

**హైదరాబాద్:**
కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు.



2లో



## కేసీఆర్ రాజు కాదు..

### సాధారణంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ : పీసీసీ చీఫ్ మహేష్ కుమార్

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం ( ఫిబ్రవరి 1 ) సిట్ విచారణకు హాజరవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేసీఆర్ విచారణపై మీడియాతో మాట్లాడుతూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. కేసీఆర్ ఏమీ రాజు కాదని.. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ సాధారణంగానే జరుగుతోందని అన్నారు.



## 'రేవంత్ రెడ్డి..సిట్టూ.. లట్టు.. పొట్టు అంటూ టైం పాస్ చేస్తున్నారు'

» "సిట్ పేరిట రాజకీయ వేధింపులు: హరీష్‌రావు"
» "దర్యాప్తు కాదు.. ప్రతీకారమే: హరీష్‌రావు ఆరోపణ"
» "ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణను ఎద్దేవా చేసిన హరీష్‌రావు"
» "నోటీసుల వెనుక చట్టం లేదు: బీఆర్ఎస్"

2లో..



## సీతక్క పారిపోయే రకం కాదు

» "ఆదివాసీ అస్తిత్వం కోసం పోరాడే బిడ్డను నేను: సీతక్క"
» "కుట్రలకు భయపడే రకం కాదు: మంత్రి సీతక్క"
» "సమ్మక్క--సారలమ్మ జాతర బ్రహ్మాండ విజయం"

**మేడారం(ములుగు జిల్లా):**
మనసా వాచా కర్మణా చిత్తశుద్ధితో మా ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే ఆదివాసి బిడ్డనని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## తెలంగాణకు 3 హైస్పీడ్ రైళ్లు..

### మెట్రో గురించి ప్రత్యేకంగా ఉండదు

» "3 హైస్పీడ్ రైళ్లు ఖాయం"
» "మెట్రోకు డీపీఆర్ ఇస్తేనే నిధులు"
» "ఫోన్ ట్యాపింగ్ కేసు సీరియల్‌లా: కిషన్‌రెడ్డి"



**ఢిల్లీ:**
దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ రూపకల్పన చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. రైతులకు అండగా నిలిచేందుకు ఎరువుల రాయితీని కేంద్ర ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఎరువులపై రాయితీ వల్ల తెలంగాణ రైతులు కూడా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ గతేడాది కంటే ఈసారి పెరిగిందన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు లబ్ధి కలిగే పథకాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు.

2లో

# ఫోన్ ట్యాపింగ్ కేసు..

## నాలుగున్నర గంటల పాటు కేసీఆర్‌ను ప్రశ్నించిన సిట్

మొదటి పేజీ తరువాయి
దిల్లీ ఒత్తిళ్లకు తలొగ్గని వ్యక్తిగా కేసిఆర్‌ను అభివర్ణించారు. తెలంగాణ కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో సెకను కూడా పక్కకు తప్పుకోని ధీశాలి అన్నారు. ఈ రాష్ట్రం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయని వ్యక్తిగా పేర్కొన్నారు. దుష్ట శక్తులకు వ్యతిరేకంగా పర్వతంలా నిలబడిన మనిషి కేసీఆర్ అన్నారు. చిల్లర రాజకీయాలకు, నీచమైన ఎత్తుగడలకు వణికిపోయే వ్యక్తి కాదని.. కేసీఆర్ అజేయుడని ప్రభుత్వాన్ని ఉద్దేశించి పేర్కొన్నారు. మూర్ఖులు చరిత్రను సృష్టించడం పక్కన పెడితే.. కనీసం చరిత్రను అర్థం కూడా చేసుకోలేరని ఎద్దేవా చేశారు. ఆయన పేరు వింటేనే మీకు వణుకు పుడుతుందన్నారు. ఆయన పేరు ఎత్తే స్థాయి కూడా మీకు లేదని కాంగ్రెస్ నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. ఎంత విషం చిమ్మినా.. ఆయనను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్ర.. ఆ చరిత్రలో మీరు కనీసం ఒక చిన్న ఫుట్ నోట్ కూడా కాలేరని దుయ్యబట్టారు.

# 48కి 48 గెలవాలి..

మొదటి పేజీ తరువాయి
మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున బీసీలకు 70శాతం సీట్లు కేటాయించామని.. ఇది రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మీరు ఎన్నికల్లో గెలిచి రండి.. అభివృద్ధి నాకు వదిలివేయడంన్నారు. నల్లగొండ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగి ఎన్ని నిధులు అయినా తెస్తానని చెప్పారు. ప్రజల దగ్గరికి ఓట్ల కోసం ఎట్లా పోతామో.. వారి మంచి చెడులో కూడా అంతే భాగస్వామ్యం కావాలని సూచించారు. 30ఏళ్లుగా నా నల్లగొండ ప్రజలకు నేనేంటో తెలుసన్నారు. భవిష్యత్?లో వేల కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని.. ప్రతి ఓటరును కలిసి వారికి భరోసా ఇవ్వాలని సూచించారు. అధికార పార్టీ కార్పొరేటర్లు గెలిస్తే నా దగ్గరికి వచ్చి అభివృద్ధి, సంక్షేమ పనులు చేసుకోవచ్చన్నారు.

# తెలంగాణకు 3 హైస్పీడ్ రైళ్లు.. మెట్రో గురించి ప్రత్యేకంగా ఉండదు

మొదటి పేజీ తరువాయి
“ప్రతి జిల్లాలో ఒక్కో బాలికల హాస్టల్‌ను కేంద్రం ఏర్పాటు చేయనుంది. తెలంగాణలోని 33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయి. డేటా సెంటర్లకు ఉపయోగపడే నిర్ణయాన్ని మోదీ సర్కారు తీసుకుంది. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహం వల్ల తెలంగాణకూ లాభం. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులపై ఉండే పన్నును 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించటం వల్ల తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు. రైల్వే బడ్జెట్‌ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచింది. రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయి. మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బడ్జెట్‌లో ఉండదు. మెట్రోపై డీపీఆర్ ఇస్తే.. పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇస్తుంది. మెట్రో రైలు ప్రాజెక్టుకు మంత్రివర్గ ఆమోదంతో నిధులు వస్తాయి. ప్రస్తుత మెట్రో ప్రాజెక్టు టేకోవర్ ప్రక్రియ పూర్తి చేసి డీపీఆర్ ఇస్తే కేంద్రం ఆమోదిస్తుంది. దేశంలో ఉపాధి అవకాశాలు పెంచేలా మోదీ సర్కారు చర్యలు చేపట్టింది” అని కిషన్ రెడ్డి వెల్లడించారు.

**అదో టీవీ సీరియల్‌గా..**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారిస్తోన్న సంగతి తెలిసిందే. దానిపై మీడియా అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి స్పందించారు. “ఫోన్ ట్యాపింగ్ కేసు టీవీ సీరియల్ మాదిరిగా కొనసాగుతోంది. ఇప్పటికే రెండేళ్లయ్యింది. ఇంకా ఎన్నాళ్లు సాగుతుందో తెలియదు. ఫోన్ ట్యాపింగ్ నిజమని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత చెప్పారు. సాక్షాత్తు హైకోర్టు జడ్జిల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని అఫిడవిట్ వేశారు. నేతలు, వ్యాపారులు, సినీ నటుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని అందులో పేర్కొన్నారు” అని కిషన్ రెడ్డి తెలిపారు.

# సీతక్క పారిపోయే రకం కాదు

మొదటి పేజీ తరువాయి
తాను పారిపోయినట్లు కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారాల చేశాయని, సీతక్క పారిపోయే రకం కాదన్నారు. భక్తులు, ప్రజల కోసం పంతం నెగ్గించుకునే రకం తానన్నారు. మేడారంలో మీడియా సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. ‘తనువెల్ల ఆదివాసి అస్తిత్వాన్ని, నిలువెల్లా ఆత్మగౌరవాన్ని, తల్లుల పట్ల భక్తిని కలిగి ఉన్న వ్యక్తిని నేను. మేడారం జాతర దిగ్విజయాన్ని జీర్ణించుకోలేక కొందరు చేసే కుట్రలకు భయపడే రకం కాదు

జాతరను విజయవంతం చేసిన విధంగానే జాతర తర్వాత చేపట్టాల్సిన పనులను పూర్తి చేస్తున్నాం. ఐదువేలకు పైగా పారిశుధ్య సిబ్బంది నియమించి మేడారాన్నీ పరిశుభ్రపరుస్తున్నాము. రేయింబవళ్లు కష్టపడి పనిచేసిన పోలీస్ సిబ్బందికి అభినందనలు. విఐపిల తాకిడి వల్ల ట్రాఫిక్ జామ్ అయింది

ఆ ట్రాఫిక్ జామ్ లో ఆర్టీసీ బస్సులు చిక్కుకుపోయాయి. గట్టమ దేవాలయం వద్ద ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకున్నాము. గట్టమ్మ తల్లిని దర్శించుకున్న తర్వాత సమ్మక్కకు రావటం ఆనవాయితీగా వస్తుంది కాబట్టి అక్కడ ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా నివారించాం. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఈ దఫా నివారించగలిగాము. భక్తితో బాధ్యతతో సంయమనంతో దైవ దర్శనానికి రండి అని భక్తులకు మేము చేసిన విజ్ఞప్తి పనిచేసింది

బ్రహ్మాండంగా జాతరను నిర్వహించుకున్నాము. అందరికీ అభినందనలు. సమ్మక్క సారలమ్మతో మాకు భావోద్వేగా బంధం ఉంది అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టాము. గుడి నిర్మాణ బాధ్యతలను నెత్తికెత్తుకున్నాము. గుడి నిర్మాణం జాతరకు ముందే పూర్తయింది. గతంలో జాతరకు ముందు రోజుకు ఒకటి రెండు లక్షల మంది భక్తులే వచ్చేవారు. కానీ కొత్త గుడి నిర్మాణం తర్వాత ఒకే రోజూ 8 లక్షల మంది వరకు భక్తులు వచ్చారు. గతంలో తాత్కాలికంగా పనులు జరిగేవి కానీ ఈ దఫా శాశ్వత పద్ధతిలో పనులు పూర్తి చేయడం వల్ల భక్తులు విపరీతంగా తరలివచ్చారు. త్రాగునీరు టాయిలెట్స్ ముందస్తుగానే సిద్ధం చేశాం. సమ్మక్కను సకాలంలో గద్దెల మీదకు తీసుకురావడంలో పూజారులు సహకరించారు.. వారికి ధన్యవాదాలు. కొంతమంది కొత్త పోలీస్ సిబ్బంది పూజారులను గుర్తించకపోవడం వల్ల పొరపాటు జరిగింది. ఉద్దేశపూర్వకంగా ఎవరిని ఇబ్బందులకు గురిచేయలేదు’ అని పేర్కొన్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

మొదటి పేజీ తరువాయి
మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ చేశారని.. దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్‌లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్‌కు చోటు దక్కలేదని విమర్శించారు.

ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ కేంద్రం.. . దానిని కూడా ముంబయికి తరలించారని, తెలంగాణ రాష్ట్రం ఏం తప్పు చేసిందని భట్టి ప్రశ్నించారు. రీజినల్ మెడికల్ హబ్ అని మెన్షన్ చేసినా... అందులో కూడా తెలంగాణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా...టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సమ్మక్క. సారలమ్మ దర్శనానికి న్యూజిలాండ్ ట్రైబ్స్ కూడా వచ్చారని.. కానీ, కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు.

# ‘రేవంత్ రెడ్డి..సిట్టూ.. లట్టు.. పొట్టు అంటూ టైం పాస్ చేస్తున్నారు’

మొదటి పేజీ తరువాయి
సిట్ అంటే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ కాదని.. సిట్ అంటే సీఎం ‘సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్’ అంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సిట్ విచారణపై మాజీ మంత్రి హరీష్ రావు ఎద్దేవా చేశారు.

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌పై నందినగర్ నివాసంలో కేసీఆర్‌ను సిట్ అధికారుల విచారణ కొనసాగుతుంది. ఈ క్రమంలో కేసీఆర్ సిట్ విచారణపై హరీష్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో..సిట్ పేరిట జరుగుతోంది దర్యాప్తు కాదు, ప్రతిపక్ష నేతపై ప్రతీకార దాడి నోటీసుల వెనుక చట్టం లేదు, కేవలం రాజకీయ ప్రతీకారం,రేవంత్ రెడ్డి అహంకారం మాత్రమే ఉంది. సిట్ పేరిట సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను బహిరంగంగా ఉల్లంఘించారు. నోటీసులు ఇవ్వడంలో కనీస చట్టపరమైన విధానాలే పాటించలేదు.

కేసీఆర్ ఎక్కడ ఉంటున్నారో ఈ రాష్ట్రానికి తెలియదా? ఇంటలిజెన్స్ వ్యవస్థ మొత్తం ఎర్రవెల్లి చుట్టే ఉన్నా నందినగర్ గోడలకు నోటీసులు అంటించడం మీ చౌక బారు రాజకీయానికి నిదర్శనం. పదేళ్లు రాష్ట్రాన్ని నడిపిన ముఖ్యమంత్రికి ఇదేనా కాంగ్రెస్ పాలన ఇచ్చే మర్యాదా? ప్రజలు ఎన్నుకున్న ప్రతిపక్ష నేతపై రేవంత్ ప్రభుత్వం వ్యవహరించి తీరు ప్రజాస్వామ్యానికి అవమానకరం.

పాలన చేతకాక, హామీలు నెరవేర్చలేక, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేక ప్రతిపక్షంపై కక్ష తీర్చుకోవడమే కాంగ్రెస్ ఏకైక అజెండా అయ్యింది. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, వరుస కుంభకోణం నుంచి దృష్టి మళ్లించేందుకు సిట్ పేరుతో నోటీసులు జారీ చేయడం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించడం రేవంత్ రెడ్డి రాజకీయ దివాలా కోరుతనానికి నిదర్శనం.

చరిత్రను సృష్టించినవాడు కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి. సిట్ అంటే సిట్ కాదు. ఇది జ✕ు సిట్..‘సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్’. విదేశాల్లో ఉన్న సీఎం ఫోన్ చేసి ఏది చెబితే ఇక్కడ అది పాటిస్తున్నారు పోలీసులు. సిట్ స్వతంత్రంగా పని చేయడం లేదు, సీఎం కార్యాలయం నుండి వచ్చే ఆదేశాలకే పని చేస్తోంది. సిట్ అంటే సిట్ స్టాండ్ అంటే స్టాండ్. చట్టాన్ని ఉల్లంఘిస్తూ, రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు.

మీరు ఇచ్చిన నోటీసులు చట్ట బద్దం కావు మీరు అనుసరించిన విధానం రాజ్యాంగం బద్దం కాదు. అయినా సరే.. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా, బాధ్యతాయుతమైన భారత పౌరుడిగా కెసిఆర్ దర్యాప్తుకు సహకరిస్తున్నారు. అధికారం మదంతో సిట్ పేరిట నువ్వు చేస్తున్న డ్రామాలు నీ వికృత వైఖరికి, నీ పరిపాలనా చేతగానితనానికి నిదర్శనం. కేసీఆర్ దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తున్నా.. పోలీసులు ఎందుకు అతి చేస్తున్నట్లు?. మా నాయకులు, కార్యకర్తలను ఎక్కడిక్కడ అరెస్టులు చేశారు, అదుపులోకి తీసుకున్నారు.

గజ్వేల్ నుండి హైదరాబాద్ దాకా వేలాది మంది పోలీసులను మోహరించారు. బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తున్నాం. రెండేళ్లుగా చేసింది లేదు, చెప్పుకునేందుకు ఏదీ లేదు అందుకే రేవంత్ రెడ్డి..సిట్టూ.. లట్టు.. పొట్టు అంటూ టైం పాస్ చేస్తున్నడు. దర్యాప్తు పేరు చెప్పి ముందే తీర్పు రాయడం కాంగ్రెస్ రాజకీయ సంస్కృతి.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించాలి. కానీ కాంగ్రెస్ పాలనలో ప్రశ్నిస్తే నోటీసులు, మాట్లాడితే అరెస్టులు. ఇది కాంగ్రెస్ న్యూ డెమోక్రసీ మోడల్ రైతుల కష్టాలు పట్టవు, యువతకు ఉద్యోగాలు ఇవ్వరు, అవ్వా తాతలకు పింఛన్లు పెంచరు. ఆరు గ్యారెంటీల అమలు చేయరు కానీ.. ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ తన భయాన్ని బహిరంగంగా ప్రకటించింది. భయపడే ప్రభుత్వాలే ప్రతిపక్షాన్ని టార్గెట్ చేస్తాయి. చరిత్ర సృష్టించిన నాయకుడిని,కేసులు పెట్టి చిన్నబుచ్చగలమని అనుకోవడం కాంగ్రెస్ భ్రమ. చరిత్రను చెరిపేయలేరు. ప్రజల గుండెల్లో ఉన్న కేసీఆర్ పేరును తుడిచేయలేరు’ అని పేర్కొన్నారు.

# గ్రూప్ వన్‌లోనూ సత్తా చాటిన సురేశ్

గ్రూప్-2 ఫలితాల్లో సత్తా చాటిన సురేష్ అనే యువకుడు శుక్రవారం రాత్రి విడుదలైన గ్రూప్-వన్ ఫలితా ల్లోనూ విజయకేతనం ఎగురవేశారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం రాపూరివాండ్లపల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన యదశంద్రం సిద్ధప్ప, సిద్ధమ్మ దంపతుల కుమారుడు సురేష్. ఈయన గత ప్రభుత్వంలో సచివాలయ కార్యదర్శిగా ఎంపిక య్యారు. ఆ ఉద్యోగం చేస్తూనే గ్రూప్ పరీక్షలకు సిద్ధమయ్యారు. తొలుత గ్రూప్-2 పరీక్షలు రాసి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. అలాగే గ్రూప్-1 పరీక్షలూ రాసిన సురేష్ విజయం సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు.

# వందశాతం ఇంటిపన్ను వసూలు గ్రామకార్యదర్శిని అభినందించిన అధికారులు

గ్రామపంచాయతీ ఇంటి పన్నుల వసూళ్లలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపు విధానం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రతి ఇంటి యజమానికి ఒక ప్రత్యేక అసెస్మెంట్ నెంబర్ కేటాయించి నేరుగా చెల్లింపు జరిపే ఈ విధానం 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టారు. అయితే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని నవాబుపేట

గ్రామం నూరు శాతం ఆన్ లైన్ లో పన్నులు వసూలు చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. గ్రామం చిన్నదైనప్పటికీ అందర్నీ ఒప్పించి ఇలా వసూలు చేయగలిగారు. ఆ గ్రామ పంచాయతీ గ్రేడ్-4 కార్యదర్శి వాతాడ హనుమ ఈ పన్నుల వసూళ్ళలో కీలక పాత్ర పోషించారు. 318 ఇళ్లు గల ఆ గ్రామంలో ఈ ఏడాది ఇంటిపన్ను డిమాండ్ రూ.2,06,560 కాగా అంతకు ముందు సంవత్సరాల బకాయిలు మరో రూ. 52,711 ఉన్నాయి. మొత్తం ఈ సొమ్ము రూ.2,59,271 లను జనవరి 8 నాటికే వసూళ్లు చేశారు. అందుకనే గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆ గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి హనుమ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అయితే ఆ గ్రామ సర్పంచ్ సూరంపూడి ముత్యాలమ్మ ఈనెల 6న అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఉప సర్పంచ్ నూకపెయ్య సురేఖకు ఇంచార్జ్ సర్పంచ్ బాధ్యతలు ఇవ్వనున్నారు. ఇది ఇలా ఉండగా నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేసి జిల్లాకే ఆదర్శంగా నిలిచిన పంచాయతీ కార్యదర్శి హనుమను ఉపసర్పంచ్ సురేఖతో పాటు మాజీ సర్పంచ్ బక్కా గురుచంద్ర స్వరూప్, మాజీ ఉప సర్పంచ్ నామాల సత్తిబాబు, నేత సూరంపూడి ఆనంద్, ఎంపీడీవో ఏ.రాజు,డిప్యూటీ ఎంపిడివొ(జిఎస్‌డబ్ల్యుఎస్) ఎస్.వీర్రాజు, తదితరులు శనివారం అభినందించారు.

# అమెరికాతో ఒప్పందంపై తొందరలేదు ఇయూతో ఒప్పందంతో దేశానికి మేలు

**- అమలయ్యే తేదీని త్వరలో ప్రకటిస్తాం**
**- వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ వెల్లడి**

ఇటీవల భారత్ యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పరిణామం తర్వాత అమెరికాతో కూడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్ కుదుర్చుకుంటుందా? అనే ప్రశ్నకు భారత వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ లేదని జవాబిచ్చారు. ఆయన ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. రష్యాతో చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా 50 శాతం పన్నుల్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అమెరికా బెదిరింపులకు లొంగి.. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి భారత్ లొంగిపోయిందనే వార్తలొచ్చాయి. అయితే.. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ముగింపు దిశగా సాగుతుందని పీయుష్ గోయల్ తాజాగా అన్నారు. ఇయుతో భారత్ కుదుర్చుకున్నది మంచి ఒప్పందం. ఈ ఒప్పందం విషయంలో మేము చాలా చురుగ్గా పాల్గొన్నాము. ఈ ఒప్పందం విషయంలో ఇరుపక్షాలు సంతృప్తి చెందాయి. ఈ ఒప్పందం

ఎప్పుడు అమల్లోకి వస్తుందో తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన ఈ ఇంటర్వ్యూలో చెప్పారు.÷ూగా, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం చేసుకుంటుందా? అని ప్రశ్నించగా.. అమెరికాతో ఒప్పందం విషయంలో కానీ.. ఆ దేశంతో పరిష్కరించుకోవాల్సిన సమస్యలు కానీ ఏమీ లేవని నేనకుటున్నాను. కానీ ప్రస్తుతం మేము అమెరికాతో ఒప్పందం చేసుకోకూడదని అనుకుంటున్నాము. ఆ దేశంతో ఒప్పందం ముగించాలనే ఆలోచిస్తున్నాము అని గోయల్ అన్నారు.÷నడా ప్రధాని మార్క్ కార్నీ ఈ ఏడాది మార్చిలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కెనడాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశముందని గోయల్ తెలిపారు.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం

మొదటి పేజీ తరువాయి
ఎక్సైజ్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయుధాలు సమకూర్చుతామని చెప్పారు. నిజామాబాద్‌లో జనవరి 23న అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా సౌమ్య ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్రమ రవాణాదారులు ఆమెను వాహనంతో ఢీకొట్టారు. ఈ క్రమంలో తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్‌లో సౌమ్యకు చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం రాత్రి మృతిచెందారు.

# పారిశ్రామిక విప్లవానికి బడ్జెట్ బాటలు

మొదటి పేజీ తరువాయి
**ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఈసీఎంఎస్)**

ఎలక్ట్రానిక్ వస్తువుల విడిభాగాల తయారీని ప్రోత్సహించేందుకు ఈ పథకం కేటాయింపులను ఏకంగా రూ.40,000 కోట్లకు పెంచారు. దీనివల్ల మొబైల్స్, ల్యాప్‌టాప్‌ల విడిభాగాలు భారత్‌లోనే తయారవుతాయి.

**టెక్స్‌టైల్స్ రంగం - ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్**

వస్త్ర పరిశ్రమ బలోపేతానికి నేషనల్ ఫైబర్ స్కీమ్, టెక్స్‌టైల్ విస్తరణ, ఉపాధి పథకాలు ఉన్నాయి. పాత టెక్స్‌టైల్ క్లస్టర్లను ఆధునీకరించడం వీటి ప్రధాన ఉద్దేశం.

**ఇతర కీలక మౌలిక సదుపాయాల పథకాలు**

కంటైనర్ తయారీ: గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ వాటాను పెంచడానికి రూ.10,000 కోట్లతో కంటైనర్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్.

**ఇండస్ట్రియల్ క్లస్టర్లు:** దేశవ్యాప్తంగా ఉన్న 200 పాత పారిశ్రామిక వాడలను ఆధునిక సాంకేతికతతో పునరుద్ధరించనున్నారు.

**హైటెక్ టూల్ రూమ్స్:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో అత్యాధునిక టూల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎంఎస్ఎంఈలకు సాంకేతిక సహాయం అందిస్తారు.

**క్రీడా సామగ్రి:** సరసమైన ధరల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడా సామగ్రిని తయారు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

నిర్మాణ పరికరాలు: అధిక విలువ కలిగిన నిర్మాణ, మౌలిక సదుపాయాల యంత్రాల తయారీని దేశీయంగా బలోపేతం చేయనున్నారు.

# కేసీఆర్ రాజు కాదు..

మొదటి పేజీ తరువాయి
ఫోన్ ట్యాపింగ్ చేసి ఇప్పుడు ఏజ్ పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్.

సినీ తారల ఫోన్లు ట్యాప్ చేసి.. బ్లాక్ మెయిల్ చేశారని.. వ్యాపారులు, కాంట్రాక్టర్లను బెదిరించి పైసలు వసూలు చేశారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కోసమే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని.. నోటీసులిస్తే, విచారణకు వస్తే సరిపోతుందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఇరుక్కుపోయారని.. తప్పు చేస్తే జైలుకు పోక తప్పదని చరిత్ర చెబుతోందని అన్నారు మహేష్ కుమార్ గౌడ్.

బీఆర్ఎస్ హయాంలో అత్యంత ఘోరమైన ఫోన్ ట్యాపింగ్ నేరం చేశారని.. ఉగ్రవాదుల మీద తప్ప, ఇతరుల ఫోన్లు ట్యాప్ చేయొద్దని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి ప్రముఖుల సంసారాల్లో తొంగి చూశారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. బీఆర్ఎస్ పాలనలో అనేక కుంభకోణాలు జరిగాయని.. విచారణకు రమ్మంటే ర్యాలీలు ఎందుకని ప్రశ్నించారు మహేష్ కుమార్ గౌడ్.

# హెడ్ కానిస్టేబుల్ కూతురు డిఎస్పీ గ్రూప్ వన్‌లో విజయం సాధించిన అంజన

సశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన గురుజు లక్ష్మి అంజన గ్రూప్ 1 లో విజయం సాధించి డిఎస్పీ గా ఎంపికయ్యారు. తండ్రి దివాకర్ హెడ్ కానిస్టేబుల్ గా ప్రస్తుతం భీమవరం రూరల్ సర్కిల్ కార్యాలయంలో రైటర్ గా పని చేస్తున్నారు. తల్లి హేమలత ప్రైవేట్ కళాశాలలో పనిచేస్తున్నారు. అంజన భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసి సివిల్స్ కు శిక్షణ పొందుతున్నారు. గతంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లి 13 మార్కుల తేడాతో అవకాశం కోల్పోయారు. అయినా పట్టుదలతో ఇప్పుడు గ్రూప్ 1 లో విజయం సాధించారు. తను పనిచేసే పోలీస్ శాఖలో కుమార్తె డిఎస్పీ గా ఎంపిక కావడం పట్ల దివాకర్ అమితానందం వ్యక్తం చేస్తున్నారు. ఈమెను పలువురు పోలీసు అధికారులు అభినందిస్తున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఫిబ్రవరి 2, 2026

# కోరుట్లలో సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**కరపత్రం ప్రతినిధి, కోరుట్ల**
కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ వేధింపులకు నిరసనగా కోరుట్ల పట్టణంలో ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ భారీ బైక్ ర్యాలీ నిర్వహించింది. ర్యాలీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రాజకీయ కక్ష సాధింపు చర్య అని తీవ్రంగా ఖండించారు.

## ఐలాపూర్ భక్తుల కోసం వాటర్ ట్యాంక్

**– నిర్మించిన తాటికొండ విశాల్, శిరీష**



**కరపత్రం ప్రతినిధి, కోరుట్ల**
కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలోని శుక్రవారం అమ్మవారి (మఠ్రవ్వ) దేవాలయం వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తాటికొండ విశాల్, శిరీష ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సౌకర్యం అందించాలనే ఉద్దేశంతో ఈ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో తాటికొండ కుటుంబసభ్యులు, గ్రామ సర్పంచ్ ద్యావనపెల్లి రామకృష్ణ, ఉపసర్పంచ్ శ్రీమతి వనపర్తి సౌమ్య, అడ్వొకెట్ క్రాంతికుమార్, వార్డు మెంబెర్స్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యాల కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

## వార్డు సభ్యురాలు రోహిణికి సన్మానం



**కరపత్రం ప్రతినిధి, కోరుట్ల**
జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం సంగేమ్ గ్రామంలో ఆరో వార్డు సభ్యురాలిగా ఎన్నికైన వంజరి సంఘానికి చెందిన తుదిగేని రోహిణి రాజగోపాల్‌ను ఆదివారం వంజరి సంఘం జిల్లా డైరెక్టర్ ముస్కేరి తుక్కారం ఆధ్వర్యంలో రావోజి వంజరి సంఘం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేటలో వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
మల్లాపూర్ మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు ఎలాల జలపతి రెడ్డి, కనుముల సర్పంచ్ వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు కూడా పాల్గొన్నారు.

## గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేయాలి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
గత మహాశివరాత్రి జాతర అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఏర్పాటు చేయాలని రాజన్న ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఉద్యోగులకు సూచించారు. ఆదివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 14 నుండి 16 వరకు జరుగు మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై ఉద్యోగులతో ఈవో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆమె ఆలయ సిబ్బందికి సూచించారు. ఇటీవల నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఆలయ ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వహించి, భారీ సంఖ్యలో వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతరను విజయవంతం చేసినందుకు సిబ్బందిని అభినందించారు.

# మైసిరెడ్డిపల్లిలో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్

## – విజేతగా నిలిచిన కోనాయిపల్లి శివాజీ యూత్







**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మండలంలోని మైసిరెడ్డిపల్లిలో నిన్న క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. కోనాయిపల్లి మరియు మైసిరెడ్డిపల్లి గ్రామాల మధ్య జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఉల్లాసంగా ఆనందంగా ముగిసింది.
కోనాయిపల్లి ఫిషరీస్ సొసైటీ నిర్వహించిన ఈ టోర్నమెంటులో మొత్తం ఐదు టీములు పాల్గొన్నాయి. కోనాయిపల్లి నుండి మూడు టీములు, మైసిరెడ్డిపల్లి నుండి రెండు టీములు పాల్గొన్నాయి.
మైసిరెడ్డిపల్లికి చెందిన మల్లిగారి ప్రేమ్ మరియు మల్లిగారి కరుణాకర్ ల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ కేరింతలతో పూర్తయింది.

**– విన్నర్స్ శివాజీ యూత్**
**– రన్నర్స్ త్రిశూల్ యూత్**

ఉత్సాహంగా పూర్తి ప్రొఫెషనల్ రీతిలో సాగిన ఈ టోర్నమెంట్ లో విన్నర్స్ గా కోనాయిపల్లి గ్రామానికి చెందిన శివాజీ యూత్, రన్నర్స్ గా త్రిశూల్ యూత్ నిలిచింది.

**– కోనాయిపల్లి ప్రైమరీ ఫిషరీస్ సొసైటీ చైర్మన్ శ్రీ గుంటి కుమార్ గారు విజేతలకు బహుమతులు అందించారు**

కోనాయిపల్లి శివాజీ యూత్ కి మొదటి నగదు బహుమతి, మరియు త్రిశూల్ యూత్ కి రెండవ నగదు బహుమతి అందించిన శ్రీ గుంటి కుమార్ గారికి రెండు గ్రామాల యువత ప్రజలు అభినందనలు తెలియజేశారు.
ఈ టోర్నమెంటును ఆహ్లాదకరంగా నిర్వహించిన మల్లిగారి ప్రేమ్, మల్లిగారి కరుణాకర్ కు మరియు టోర్నమెంటుకు సహకరించిన కోనాయిపల్లి నాయకుడు శ్రీ గుంటి శేఖర్ గారికి నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు.

**– యువతకి క్రికెట్ ఫేవరెట్ ఆటగా మారిందని ఫిషరీస్ సొసైటీ చైర్మన్ శ్రీ గుంటి కుమార్ గారు అన్నారు. యువత క్రీడా స్ఫూర్తితో ఐకమత్యాన్ని, సోదర భావాన్ని, జాతీయ భావాన్ని కనబరచాలని శ్రీ గుంటి కుమార్ ఈ సందర్భంగా యువతకు మార్గదర్శనం చేశారు**

మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రైవేటు క్రికెట్ గ్రౌండ్స్ పనిచేస్తున్నాయి. ఈ క్రికెట్ ఆటతో యువకులు తమ విశ్రాంతి సమయాల్లో ఆటలాడుతూ ఆరోగ్యాన్ని ఆనందాన్ని పెంపొందించుకుంటున్నారు. దురలవాట్లకు లోను కాకుండా యువత ఇలా ఆరోగ్యాన్ని ఆనందాన్ని సంపాదించుకుంటున్న క్రీడలను, క్రీడాకారులను ప్రభుత్వము తగిన రీతిలో ప్రోత్సహించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సిట్ విచారణకు కేసీఆర్

## – శామీర్ పేట్ లో పార్టీ శ్రేణుల పూలవర్షం








**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
సిట్ విచారణకు హాజరయ్యేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి బయలుదేరారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం కార్యాలయం రాజీవ్ రహదారిపై కేసీఆర్ కాన్వాయ్ వెళ్తుండగా, బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు పూలతో ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ కాన్వాయ్ పై పూలు చల్లుతూ, 'జై కేసీఆర్, జై జై కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ శ్రేణులను చూసిన కేసీఆర్ కాసేపు తన కాన్వాయ్ ను ఆపి వారికి అభివాదం చేశారు.

**– రాజకీయ వేధింపులకు నిరసన**

శామీర్‌పేట్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వంపై భారీగా నిరసనలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ పై వేధింపులకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడమే లక్ష్యం

**-మహిళలకు 2500 పెన్షన్ ఏమైంది**
**-కేసీఆర్ కిట్టు ఎందుకు మాయమైంది**
**-ఓట్ల కోసం వచ్చే కాంగ్రెసోల్లని నిలదీయండి**
**-జోగిపేట 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పట్లూరి శివశేఖర్**





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి (చాపల సత్యం):**
ప్రస్తుతం జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా గులాబీ దండు సిద్ధమైందని అందోలు-జోగిపేట మున్సిపల్ 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి బరిలో నిలిచిన పట్లూరి శివశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పథకాలు అధికారంలోకి వచ్చక అవి అమలు ఎందుకు చేయలేకపోతున్నారని, అసలు ఆ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహాలక్ష్మి కింద 2,500 పెన్షన్లు, కేసిఆర్ ఇచ్చే కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లకు అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీలు ఎందుకు అమలుకు నోచుకోలేకపోతున్నాయని ఆరోపిస్తూ ఇది ప్రజలను మోసం చేసే హామీలు కావా అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళలు ప్రసవిస్తే కేసీఆర్ కిట్టును బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిందని ఇప్పుడు అది పేరు తెలియకుండా మాయమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగే మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెసోళ్లను ఓటరు ప్రశ్నిస్తూ నిలదీయాలని సూచించారు. ఏది ఏమైనా అందోలు-జోగిపేట మున్సిపల్ పై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి ఆగం కాకుండా కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

# కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు మొండిచేయి

**– సామాన్యునికి ప్రయోజనం లేని బడ్జెట్**
**– రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపిందని, మరోమారు రాష్ట్రానికి అన్యాయం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కేంద్ర బడ్జెట్ పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందిస్తూ బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు లేకపోవడం దారుణం అన్నారు. చాలా సార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు ఎంపీలు ఎన్ని సార్లు కలసి ప్రధానిని విన్నవించుకున్న రాష్ట్రాన్ని విస్మరించారని మండిపడ్డారు. కేవలం కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూర్చే విధంగా సామాన్యుడి నడ్డి విరిచేలా ఉందన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు,మూసి అభివృద్ధికి నిధులు కోరిన ఇవ్వలేదన్నారు. కేవలం ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు,మిత్ర పక్షాలకు మాత్రమే నిధులు కేటాయించారని ఆరోపించారు. బయోఫార్మా అంటే ముందుగా గుర్తుకు రావాల్సింది తెలంగాణ అని హైదరాబాద్ పరిసరాల్లో ఎలక్ట్రానిక్ ఎకో సిస్టమ్ విస్తరించి ఉంది, కానీ బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టారని క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే బడ్జెట్‌లో స్పోర్ట్స్ విభాగంలోనూ తెలంగాణకు కేటాయింపులు లేవన్నారు. తెలంగాణ నుండి 8 మంది ఎంపీలు ఉన్న రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు.

# గౌడ సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో తమ విధులను నిర్వహించి పురస్కారం పొంది

» కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగస్తులుగా బహుమతులను తీసుకున్న
» గౌడ సంఘ ముద్దు బిడ్డలకు సన్మానాన్ని నిర్వహించిన వెల్దుర్తి గౌడ సంఘ సభ్యులు
» తమ విధులను నిర్వహిస్తూ గౌడ జాతి ప్రఖ్యాతిని ప్రపంచానికే చాటి చెప్పే విధంగానే .!!!
» తమ విధులను నిర్వహించాలని వెల్దుర్తి గౌడ సంఘ సభ్యులు ఆకాంక్ష...!!!





**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జనవరి 1**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో, తపాలా కార్యాలయంలో 30 సంవత్సరాలు విజయవంతంగా పూర్తిచేసుకుని పదవీ విరమణ పొందిన సందర్భంగా జగ్గా చంద్ర గౌడ్ , రేణుక మాత ఆలయానికి కిరీటాన్ని బహకరించిన మెడికల్ కొమ్మిరి శెట్టి శ్రీనివాస్, ఉత్తమ ఉద్యోగులుగా కలెక్టర్ చేతులమీదుగా ఉన్నత పురస్కారం పొందిన నాలా చెరువు సంపత్ గౌడ్, సాయికుమార్ గౌడ్ లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది, వెల్దుర్తి మండల కేంద్రంలోని గౌడ కులస్తుల రేణుక దేవాలయం లోని ఆదివారం నాడు వారికి సన్మానాన్ని ఏర్పాటు చేశారు ప్రతి సంవత్సరం వివిధ సేవల్లో పురస్కారం పొందిన గౌడ సంఘం ముద్దుబిడ్డలకు సన్మానం చేయడం జరుగుతుందని స్థానిక వెల్దుర్తిడాక్టర్ నాల చెరువు వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో తపాలా కార్యాలయంలో పదవి విరమణ పొందిన సందర్భంగా వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన జగ్గాచంద్ర గౌడ్ ప్రముఖ వ్యాపారవేత్త మెడికల్ శ్రీనివాస్ రేణుకా మాత దేవాలయానికి రాగి కిరీటం బహుకరించిన సందర్భంగా,గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఉద్యోగులుగా వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన నాలాచెరువు కిష్టా గౌడ్ తనయులు నాలాచెరువు సంపత్ గౌడ్, సాయి కిరణ్ గౌడ్ లను అత్యంత ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా సంపత్ గౌడ్ సాయికుమార్ గౌడ్ తండ్రి మాట్లాడుతూ తమ తనయులను అతి కష్ట కాలంలో చదువులో ఉన్నత చదివించడం జరిగిందని తమ కష్టార్జితంతో చదివిన చదువులకు విలువలను ఇచ్చుకుంటూ వారు చదివిన చదువులకు నేడు వారికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో వారు కూడా వారి పదవులకు ఎంతో విలువలను ఇచ్చుకుంటూ వారి వీధి విధానాల నిర్వహణలో నిర్వహించడంతోని నేడు వారికి సమాజంలో గొప్ప గౌరవంతో వారు ఆశించని విధి నిర్వహణలో వారికి ఎంతో విలువలను దక్కడం ఎంతో గర్వ కారణమని తండ్రి నాలాచెరువు కిష్టా గౌడ్ ఆనందాన్ని వ్యక్తం చేశారు నేటి సమాజంలో ప్రజా సేవ చేయడం ఎంతో అదృష్టంగా భావించడం తమ తనయుల వలన వారికి దక్కిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు నేటి సమాజంలో ప్రభుత్వ ఉద్యోగాలు రావడమే ఎంతో కష్టంగా ఉందని అలాంటి తరుణంలో తమ తనయులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమే కాకుండా వారు ప్రజల సేవ చేస్తేనే ప్రభుత్వ అధికారులు గుర్తించి వారికి ఉత్తమ ఉద్యోగస్తులుగా గుర్తించి పురస్కారాలను అందించిన అధికారులకు కృతజ్ఞతలుగా ఉంటామని వారు తెలియజేశారు ఆదివారం నాడు తమ కులాస్తులు అయిన గౌడ సంఘ సభ్యులు తమ తనయులకు శ్రీ రేణుకా మాత ఆలయంలో సన్మానించినటువంటి సందర్భంలో వారు తపాలా సంస్థ కార్యాలయంలో 30 సంవత్సరాలుగా పనిచేసిన వెల్దుర్తి గౌడ సంఘ ముద్దుబిడ్డ చంద్ర గౌడ్ పదవి విరమణ పొందిన సందర్భంగా కూడా ఆయనకు సన్మానం చేయడం జరిగిందని గౌడ సంఘ కులాస్తులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## భారీగా కాంగ్రెస్ లో చేరిన నాయకులు



**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఫిబ్రవరి 1:**
రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు ఎన్టిపిసి ప్రాంతానికి చెందిన నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షులు ఆసిఫ్ పాషా ఆధ్వర్యంలో 31, 33 డివిజన్‌లకు చెందిన సుమారు 30 మందికి పైగా ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న కాంగ్రెస్ పార్టీ పాలన, సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలపై తీసుకుంటున్న నిర్ణయాలే పార్టీ బలోపేతానికి కారణమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని, ప్రతి కార్యకర్త ప్రజాసేవనే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై పూర్తి నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రేకుర్తి 20 డివిజన్లో బూత్ స్థాయి సమావేశం



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 1**
కరీంనగర్ రేకుర్తి 20వ డివిజన్ లో డివిజన్ కన్వీనర్ గోదరి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ,పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాలారెడ్డి హాజరై మాట్లాడుతూ కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి జరిగింది అంటే కేవలం కేంద్రం నుండి నరేంద్ర మోడీ ఇచ్చిన నిధులతో మాత్రమే కరీంనగర్లోని డివిజన్లో అభివృద్ధి జరిగిందనీ ,కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసే బిజెపి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని, కరీంనగర్లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్రం నుండి తీసుకొచ్చిన నిధులను బుక్లెట్ రూపంలో ప్రతి గడపగడపకు, ఇందిరమ్మ కాలనీ పేరు లక్ష్మీ గణపతి కాలనీలో ప్రారంభం చేయడం జరిగిందనీ, 20 డివిజన్లో ప్రతి గడపగడపకు చేర్చాలని కార్యకర్తలకు సూచన చేశారు. ఇట్టి కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇంచార్జ్ పొన్నాల రాము, ఎడమ సాయి, కో కన్వీనర్ రాహుల్ ,నరేందర్, జాడీ రాజు, బండారి శ్రావణ్ ,మల్లికార్జున్ ,ఉపేందర్ రమేష్ కొత్తపల్లి శంకర్ భాస్కరాచారి దేవజి రవీంద్ర చారి చరణ్ చందు ఐలయ్య కృష్ణమాచారి ఇస్లావత్ రవి, రామచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మిఎల్లన్న ఇంటింటి ప్రచారం



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 01:**
రామగుండం కార్పొరేషన్ 57వ డివిజన్ అభ్యర్థి పాతపెల్లి లక్ష్మి ఎల్లన్న యాదవ్ గడప గడప తిరుగుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఎల్లన్న మాట్లాడుతూ గత 46వ డివిజన్ ఉన్నప్పుడు రామగుండంలో ఆదర్శవార్డుగా తీర్చిదిద్దానని, అంతేకాకుండా డివిజన్ ప్రజల కోసం కూరగాయల మార్కెట్, ఓపెన్ జిమ్ పార్కు నేను గెలిచాక రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ తో మాట్లాడి త్వరలో పనులు ప్రారంభించేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టీఎన్జీవోల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ జన్మదిన శుభాకాంక్షలు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 1**
మున్సిపల్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ జన్మదిన సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో టీఎన్జీవోల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, వెంకటేశ్వర స్వామి కండువా, శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.
ఈ సందర్భంగా టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు, స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని తెలిపారు. నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం అహర్నిశలు, అనుక్షణం విశేష కృషి చేస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సేవలు ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. ప్రజలు--ప్రభుత్వ ఉద్యోగుల మధ్య సమన్వయ వారధిగా నిలుస్తూ, నగర అభివృద్ధికి వినూత్న నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్న కమిషనర్ నాయకత్వం అభినందనీయమని తెలిపారు. కరీంనగర్ నగరాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న కృషి స్లాఘనీయమని, ఇలాంటి సేవలు మరింత కాలం కొనసాగించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టిఎన్జీవోలు ముద్రించిన డైరీ 2026 అందించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సంఘము లక్ష్మణరావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, సర్దార్ హర్విందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి రాగి శ్రీనివాస్, ఏవీ రాజేశ్వరరావు, కర్ణాకర్, నారాయణ, పూర్ణచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 50 వ డివిజన్లో ఇంటింటా విస్తృత ప్రచారం చేపట్టిన బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి బోయినపల్లి ప్రవీణ్ రావు.



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 1**
కరీంనగర్ పట్టణం 50 వ డివిజన్లో బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి బోయినపల్లి ప్రవీణ్ రావు ఆదివారం రోజున ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా బోయినపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ 2014 లో కేంద్రంలోఅధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం , ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో కరీంనగర్ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కరీంనగర్కు స్మార్ట్ సిటీ హోదా ఇచ్చిందని, గత 11 ఏళ్లుగా కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం వందల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. నిధుల కేటాయింపు కోసం కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసంమోడీ ప్రభుత్వం కేటాయించిన నిధుల గురించి గ్రహించి, జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి అండగా నిలవాలని కోరారు.కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసం, నగర రూపురేఖలు మార్చడానికి ప్రయత్నించింది మాత్రం కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వమనేది నగ్న సత్యమన్నారు.కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పగ్గాలు నాడు బీఆర్ఎస్ చేతిలో ఉన్న , బిజెపి అధికారం లో లేకపోయినా కరీంనగర్ పట్టణ అభివృద్ధి కోసమే నిరంతరం ఆలోచన చేసిందనీ, ఆ దిశగానే వందల కోట్ల నిధులతో కరీంనగర్ అభివృద్ధి కోసం కృషి చేసిన బీజేపీకి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఒక అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ సహాయ సహకారాలతో పట్టణం, 50 వ మరింత శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

## విచారణల పేరిట కెసిఆర్ పై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలు

- కాంగ్రెస్ సర్కార్ కుట్రలను తిప్పి కొడతాం
- వేములవాడ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
కాంగ్రెస్ ప్రభుత్వం విచారణల పేరిట తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తిప్పి కొడతామని వేములవాడ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. సిట్ అధికారులు కేసిఆర్ కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆదివారం చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో పట్టణంలోని కోరుట్ల రోడ్డు నుండి తిప్పాపూర్ బస్టాండ్ వరకు నల్ల కండువాలు ధరించి భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ తప్పుడు కేసులతో,విచారణల పేరుతో కేసీఆర్ ను ఇబ్బంది పెట్టడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి, కేవలం ప్రతిపక్ష నేతలపై కక్ష సాధించడమే ధ్యేయంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కేసీఆర్ అంటే ఒక వ్యక్తి కాదని తెలంగాణ కోట్లాది ప్రజల గుండె చప్పుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ గూడూరి ప్రవీణ్, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, నిమ్మశెట్టి విజయ్,రామతీర్థపు రాజు, సిరిగిరి చందు, మారం కుమార్, గూడూరి మధు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్ర పట్టణాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

– మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణ సమగ్రాభివృద్ధి బిజెపితోనే సాధ్యమని మాజీ మంత్రి బిజెపి రాష్ట్ర నాయకులు ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని పద్మశాలి కళ్యాణమండపంలో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజన్న క్షేత్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలు కాషాయ జెండా ఎగరవేయడానికి అత్యంత అనుకూలంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాజన్నను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా దర్శించుకున్న పవిత్ర క్షేత్రమని గుర్తు చేశారు. ?పట్టణ ప్రజలందరూ భారీ మెజార్టీతో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి పట్టణ ప్రగతికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, జిల్లా అధ్యక్షులు రెడ్డవేని గోపి, మాజి అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, నాయకులు లింగంపల్లి శంకర్, సిరికొండ శ్రీనివాస్, బండ మల్లేశం, వైభవ్ బాలరాజు,కోలా కృష్ణస్వామి, మార్త సత్తయ్యతో పాటు 28 వార్డుల బిజెపి అభ్యర్థులు, పట్టణ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

